ప్రపంచ జనాభాలో సగానికి పైగావున్న స్త్రీలు చూస్తూవూరుకుంటే ఈ మానవ కల్యాణానికి నొసటను కుంకుమ బొట్టును ఎవరు తీర్చి దిద్దుతారు?

పంఛీ కా హె హోతు ఉదాస్....

# పోస్టుచేయని ప్రేమలేఖలు

గాజులు ముంజేతిపైకి లాక్కుని మణియార్డరు ఫాంమీద సంతకం పెడుతుంటే పోస్టు మేన్ కేసి కొరకొరా చూస్తూ నిలబడ్డ జానికమ్మత్త "నీ దస్తూరి ముత్యాలకోన - ఆ సంతకం చూసి మురిసిపోడూ అతగాడు" అని నన్నూ, నా మొగుడ్నీ, నా సంతకాన్నీ పొగిడి పది రూపాయలట్టుకు పోయింది చచ్చి నీ కడుపునపుడతానంటూ - జానికమ్మత్త నోట్లో వున్న రెండంగుళాలన్నర నాలిక ఎట్లాపడితే అట్లా తిరుగుతూ వుంటుంది.

"ఏవిటి ఆ ఉత్తరం చేతిలో..."

"మీ ఆయన రాశాడా, ఎక్కడ్నుంచి?"

"అంతా కులాసా... ఏ వంటున్నాడు. భోజనం సదుపాయంగా లేదంటున్నాడా!"

వెకిలి నవ్వు పళ్ళు బైటబెట్టి... ఏం ఆడాళ్లో ఉత్తరం చదువుకో నివ్వరు.

"తిన్నగా వుంటాడా ఏమో నమ్మలేము. ఈ కాలం కుర్రాళ్ళు.... మీ ఆయన సంగతి కాదు నేను చెప్పేది. అతనికేం బుద్ధిమంతుడే."

"డబ్బు జాగర్తచేసి వుంచమను. బంగారం కొనమను. ఏవన్నా చేయించుకో - ఇది చేయించుకోవడం గొప్పకాదు. దీనికేం అందరికీ అయేదేగా - పిలవకుండా వస్తుంది. గుడ్డలూ గుడుసుల కోసం తగలెయ్యకండి వెర్రి మొహాలు.... నాలుగు కాసులుకొని చేయించుకుని ఏవన్నా మెళ్ళో వేసుకుంటే నిండుగా వుంటుంది. పచ్చని పిల్లవు. కాపరానికెళ్ళి ఎన్నాళ్ళయింది? జడగంటలు, నాగరం చెరిపించేసి నెక్లెసు చేయించుగున్నావా? అయ్యో తెలివి తక్కువ పిల్లా - రేపు ఓ పిల్ల బయల్దేరితే అది పెట్టుకోదూ? కనిపెంచే తల్లివి - ముందుచూపు లేకపోతే ఎల్లాగ? ఈ చీర వాళ్ళు పెట్టారా.... బాగుందమ్మా! చిలకలా వున్నావు. ఏవిటా ఉత్తరం? యింకా ఏవేం రాశాడే.... ఏవంటాడూ! వుండలేనంటున్నాడా - దొబ్బుడాయి, ఉత్తరాల్లో అట్లాగే రాస్తారు ఈ మగాళ్ళు! నమ్మకు - నీకు కోపం రాకుండా వుంటే వోమాట చెబ్తా.... అంతలా చనువియ్యకూడదు. తగు మాత్రం దూరంలో వుంచాలి. వుంచితేనే మగాళ్ళు.... ఈ ప్రేమలూ దోమలూ అంటే నాకు డోకు. సాయంపడుకుంటాలే. దీపం ముందేసుకు కూర్చుని ఆ వెర్రి మొర్రి పుస్తకాలూ అవి ఎందుకు వర్తినే చదవడం? పుణ్యమా పురుషార్థమా వో భక్తా ముక్తా - దిక్కుమాలిన రాతలు తలకు పట్టేస్తే బుర్ర తిరిగిపోతుంది. చదవకు. సుబ్బరంగా

యింత తిని పడుకో దేవుడి పటంకేసి చూస్తూ... ఆ ఫొటోలు గిటోలు వొళ్లో పెట్టుకు కూర్చోకు.... నవ్వుతావేం .... వొళ్ళు పొగరు... అణుగుతుందిలే... సందు మొగన సైకిల్ గంట ట్రింగ్ మనగానే పోస్టుమేన్ కోసం అలా పరుగెత్తకు.... వాడేవిటి నీకేసి అట్లా చూస్తాడు? నాకెందుకమ్మా ఏదో, పెద్ద దాన్ని నాలుగు ముక్కలు చెప్పాను. చెప్పాలి గనుక. వింటే వింటారు. లేకపోతే గంగలో కలుస్తారు. మనం చెబితే వినేట్లున్నారా ఈ కాలం ఆడపిల్లలు.... హాళ్ళు పెళ్ళూ ఆ విరగబాటు ఆ కులుకు తళుకు అంతా దాచుకో అమ్మా దాచుకో.... అంతలా నవ్వకూ... నీ మొగుడొచ్చి నీ విరగబాటు అణుస్తాడులే... ఏం మొగుళ్లో శుద్ధ చవటలు... చెవులు పట్టుకు ఆడించినట్లల్లా ఆడతారు.

ఆడదానికి వినయం, అణకువ, పెద్దలపట్ల గౌరవం, మర్యాద అదీ అందం. జబ్బలదాకా జాకెట్లు అందం కాదు. వస్తానమ్మా చెంబెడు నీళ్ళోసుకుని పోయి మడికట్టుకోవాలి. పొద్దు కరకర మంటోంది" అని బిందెలో చీర కుక్కుకుని నిష్క్రమించింది జానకమ్మత్త. చదవవలసిన చదువులన్నీ చదివి, చేతిలో ఉత్తరం విప్పితే చదువుకోనివ్వకుండా లాక్కుంటుందేమోనని భయం వేసింది. మొగుడూ పెళ్ళాల ఉత్తరాలలో ఏముంటుందోనని ఈ ముసలాళ్ళ కెందుకో లేనిపోని తహతహ - ఈగలు ముసిరినట్లు ముసుర్తారు. ఉత్తరం చదువుకోవాలంటే ఏ జాకెట్లోనో బొడ్లోనో దాచుకుని తలుపులన్నీ మూసుకుని రహస్యంగా దొంగపని చేస్తున్నట్లు చదువుకోవాలి. చీట్లు రాసుగునేప్పుడైతే భయం భయంగానే వుంటుంది. చీట్లు రాసుకోడాలూ, చూసుకోడాలు, చేతులూపుకోడాలు, రాసుకు తిరగడాలు అన్నీ అయాకేగదా ఏదన్నా బ్రేక్ వస్తే ప్రేమ లేఖలు పుట్టేది.

కవరుకు డబ్బులెవర్నన్నా అడగాలి. పెన్ను, కాగితమూ ఆఖరికి పెన్సిలు ముక్క సంపాదించడమూ కష్టమే. ఆ వుత్తరం పోస్టు చేయాలంటే గొప్ప కష్టం. ఎవరు తీసికెళ్తారు? నవ్వుతారు వెకిలిమాటలు వెకిలి చూపులు బరితెగించేసిందంటారు. మొగుడికి వారానికో నెలకో ఓ ఉత్తరం రాసుకోడమే కష్టమైపోతే తీరిగ్గా కూర్చుని మనసులోని భావాలను మాలకట్టి మెళ్ళో వేద్దామంటే కుదుర్తుందా? కుదరదు. ఆ అక్షరాలతో మనసులోని బాధను వెలితిని ఆకాంక్షను చెప్పాలంటే అందరాడ పిల్లలకు సాధ్యమవుతుందా? ఈ ప్రాణంలేని కాగితం, దానిమీద సిరాతో గిలికిన పంక్తులు ఎటువంటి ఆశలను మేలుకొల్పుతాయి? ఈ కాగితం, ఆ కవరూ, అది మోసుకెళ్ళే రైలు, ఆ పోస్టు సంచీ, ఎంతమంది సాయం చేస్తున్నారు ఒకరి గుండెలోని గుబుళ్ళను మరొకరికి చెప్పుకోడానికి, నా మనసు మక్కువ మదిలో కోరికల్నన్నీ గుది గుచ్చి అక్షరాభిషేకం చేసి మావారి కోసం పంపిస్తే ఆ నా అపురూప ప్రణయ లేఖను తతిమ్మా తుక్కు ఉత్తరాలతో కట్టడానికి ఎన్ని గుండెలుండాలి? ఎంత దుస్సాహసం? ఆ వుత్తరం చదువుకునేప్పుడు నేను రాసిన పంక్తులకేసి చూస్తుంటే మావారి మొహం ఎంత తమాషాగా వుంటుందో అక్కడెక్కడన్నా నేను నిలబడి దాక్కుని చూడ గలిగితే గొప్ప సంతోషం కదూ?

ఏమీ తోచదు. తోచనప్పుడు రాసుకున్న ఉత్తరాలే బావుంటాయి. పిలిస్తే పలికే దేవుడు

యింట్లో వుంటే ఖర్మ ఉత్తరాలేం రాసుగుంటాం. పెనసలుతో చీట్లు రాస్తే మావారి కోపం... మొదట్లో కలం పట్టుకోవటం చేతనయ్యేది కాదు. వ్రేళ్ళన్నీ సిరా మరకలు. ఆలోచిస్తూ కూర్చున్నపుడు తెలియకుండా ఆ చేతుల్తో చెంపల్ను రాసుకున్నందుకు చూసి ఎట్లా నవ్వారని మావాళ్ళు... పోనీ నవ్వితే నవ్వనీయండి. ఈ సిరా మరకల కాగితానికున్న అదృష్టం యీ తనువుకి లేదుగదా అనిపిస్తూంటుందోసారి – నిజవే, ఏవిటో రెక్కలు కట్టుకు ఎగరాలనుకుంటే మాత్రం ఎగరగలనా? కంటిచూపు కరువయ్యాక మనసు ఎన్ని పోకిరి పరుగుళ్ళు పెడితే మాత్రం గాలి ఎన్ని పులకరింతలు కలిగిస్తే మట్టుకు "దూరాన నా రాజు" ఎలా వచ్చి నన్ను తన ముద్దూ ముచ్చటలతో మురిపిస్తాడు? అబ్బ – విరహం అంటారే అదోటి దాటడం మాచెడ్డ కష్టంసుమండి! మంచినీళ్ళ గ్లాసులో మొహం కనిపిస్తూంటే అన్నం ఎలా సయిస్తుంది. చెట్లమీద పిట్టలు ముక్కులతో పొడుచుకుంటూ వెక్కిరిస్తూంటే, ఆకాశంలోని నీలి మేఘాల పరదాల చాటున జాబిల్లి నవ్వుతూ సాగిపోతుంటే, కంటికి కునుకే రాదు. తెల్లటి పక్కమీద మొగలి పువ్వులా పడి వంటరిగా దీనంగా చేతులుచాచి అర్థించడం వినా... కళ్ళలోంచి ప్రవాహంలా వచ్చి చెంపలు చెరువై తడిసిపోవడం వినా... చేయగలిగిందేముంది? ఏ అజ్ఞాతశక్తో బలంగా పని చేస్తూండబట్టే యిన్ని విరహాలు, కోపాలుతాపాలు కన్నీళ్ళు కంగార్లు.... పిచ్చెత్తిపోయినట్లుంటే, లోకం ముళ్ళపొదలా కఠినంగా హీనంగా చూసి హేళన చేస్తూ నవ్వుతుంటే అబ్బ ఎంతబాధ? ఎంత దిగులు?ఎంత నిరాశ?... నాకు తెలీదు యీ మొగాళ్ళు యిలా మనకుమల్లే ఎడబాటుకి వగస్తూ తిరుగుతారా? ఏమో పేకాట్లో కూర్చుంటే ప్రేయసెందుకు జ్ఞాపకం వస్తుంది. సిగరెట్లు తెగ కాల్చేసి గుండెల్లో మంటల్ని ఆర్పుకుంటా రనుకుంటాను. ఇది ఏమంటే విరహాగ్ని జ్వాల మనసుచుట్టూ తిరుగుతూ గుండెల్ని కాలుస్తూ వుంటుంది.

వంతెనమీద రైలు పరుగెడ్తూంటే, రోడ్డుమీద బస్సు బుర్రుబుర్రు మంటూంటే వీధిలో జట్కా టకటక లాడుతూ పోతూవుంటే వాటిల్లో ఒక్కదాంట్లోనేనా మీరు ఉండకూడదూ? హఠాత్తుగా వచ్చి నా కిటికీ దగ్గర నిలబడి పిలిస్తే... అలా యెందుకు జరుగుతుంది? మీరెవరో నేనెవరో... కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీళ్ళు నింపి.... అంత అదృష్టమా! "నీవులేక వీణ పలుకలేనన్నదీ' ' – "నీవులేక రాధ నిలువలేనన్నదీ" అంతా నిజమే. నాకల్లాగే అనిపిస్తుంది. మా ఇంట్లో వీణలు లేవు అనుకోండి. నేనే రాధననుకుంటే నా హృదయవీణ పలకలేక మూర్ఛనలు పోయిందని సర్దుకుంటే సరిపోతుంది. నందివర్ధనం చెట్టుక్రింద నిల్చుని కాలిమట్టెలు సరిచేసుగునేప్పుడు, పైనుంచి ఆకులమీదుగా జారిన మంచుబొట్లు నా తలమీద పడుతూంటే కొంతవూరటగా వుంటుంది. నా కోసం కన్నీరు కారుస్తున్నారెవరో అనిపించి కళ్ళు చెమరుస్తాయి. ఉదయం బొగడచెట్టు క్రింద పచార్లు చేస్తూంటే, మీదనుండి రాలే బొగడపూలు ఆ సువాసనల్ని మోసుకుంటూ వెళ్ళే చల్లనిపిల్లతెమ్మరలు మీ కిటికీలోంచి పలకరించి మిమ్మల్ని రాసుకుంటూ పోతాయనుకుంటే –ఎంత తృప్తి, ఎంత ఆనందంగా వుంటుందో చెప్పలేను.

ఏమేమొ మనసులో ఎంచుటేకాని,

తిన్నగా నా కోర్కె తెలుపనే లేదు.

ఇలాంటి రక రకాల భావాల్ను కాగితాలమీద రాసి బట్టల పెట్లో నా టాయిలెట్ బాక్సులో పెట్టివుంచా, అవి పోస్టుచేయని ప్రేమలేఖలు. పెట్టె సర్దుతూన్నప్పుడల్లా అడ్డువస్తూంటాయి. చింపలేను. పారేయడానికి మనసొప్పదు.

# ఐ పిటీ యు

మా ఆడబడుచుకూతురు తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్న కుమారి (గుంట ముండకు నాలుగై దేళ్ళుంటాయి) రాత్రిళ్ళు వచ్చి అందరిపక్కలలోనూ పడి నిద్రపోయి, ఓ రాత్రివేళ ఎవరి పక్కో తడిపేసి పుణ్యం కట్టుకుంటూ వుంటుంది. దానికి 'జలఉష' అని పేరెట్టాం. నెహ్రూగారికి మల్లే నాక్కూడా కొంచెం శాన్స్క్రిట్ వచ్చు. మనవాళ్ళు విమానానికి 'మేఘదూత్' అని, ట్రాంబేలో అణుశక్తి కేంద్రానికి 'అప్సర' అనీ, మిలిటరీ ట్రక్కుకి 'శక్తిమాన్' అని పేర్లు పెట్టలా? రోడ్లపేర్లుకూడా కింగ్సువేకి రాజపథ్ అనీ, క్వీన్స్‌వేకి జనపథ్ అని మార్చారు. అందుకే నేను నెహ్రూగారితో పోటీపడి తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్నకుమారికి జలఉష అని పేరెట్టా. ఉషా అంటే అది పలుకుతుంది. ప్రసన్న అంటే మాట్లాడదు.

ఇప్పుడు రైటర్సుగూడా సుబ్బారావు అనే పేరుకు బదులు సురేష్. శంకరానికి బదులు శేఖర్ యిలా హిందీ, సంస్కృత, బెంగాలీ మయమైన పేర్లను వాడుతున్నారు. సుబ్బమ్మ అనే పేరు సుజాతగా మార్చుకుంటున్నారు.

సినిమా కథలలో పాత్రలకు వెంకట్రావు, పోలుపిల్లి, సత్యనారాయణ, నరసయ్యా, తలుపులు లాంటి పేర్లుంటే హీరోయిన్లు యాక్టు చేయరట. అచ్చ తెలుగుపేర్లు తీసేసి రాజశేఖర్, గోపాల్, సురేష్, రాజా లాంటి పేర్లు తగిలించకపోతే ఆ కథ అడ్డం తిరుగుతుందట.

కమింగ్ టు ది పాయింట్ - కొంచెం అంగ్రేజి వచ్చినవాళ్ళ వల్ల ఎక్కువ డేంజరా? కొంచెం శాన్స్క్రిట్ వచ్చినవాళ్ళ వల్ల ఎక్కువ డేంజరా అంటే ఐడోంట్నో. కొంచెం నాలెడ్జివల్ల డేంజరేగాని సుఖం లేదు.

రచయిత్రులు చూడండి. నిశ్వసిస్తారు కాని నిట్టూర్చి అని వ్రాయరు. ఆర్ద్రనయనాలతో అంటారు - కళ్ళు చెమ్మగిల్లాయి అని వ్రాయరు. అప్రతిభులయారని వ్రాస్తారు. నిశ్చేష్టులయారని వ్రాయరు. తెలియని శాన్స్క్రిట్ మాటలు వూహూ గుప్పించేస్తూంటారు. తెలుగు మాటలు కాస్త లోకువ. అందుకని వాడరు. శైలి గొప్పగా వుండాలని మరమేకులు పెట్టి బిగించినట్లు తెలిసే తెలుగు మాటకు బదులు తెలియని సంస్కృతం మాటల్ను గుప్పించి మురిసిపోతూంటారు మన రైటరీమణులు.